# ఘోష!

ఒసేవ్... ఒసేవ్... నీ రెండవ భర్తతో ఎంత అన్యోన్యంగా కులుకుతున్నావే?... మన రెండేళ్ళ సంసారంలో ఏవక్కరోజైనా ప్రేమగ మెలిగేవా? లేదే?... అది నా ఖర్మ!... ఇది వాడి అదృష్టం! అని నేను భావిస్తాననుకుంటే... నువ్వు పొరబడ్డట్టే!... నీ కుళ్ళు బుద్ధి తెల్సుకున్నాన్లే! మళ్ళీ జన్మలోనైనా... కాదు కాదు... ఎన్నిజన్మలెత్తినా మళ్ళీ నీకే భర్తనౌతాను. అప్పుడు చెప్తానే నీ సంగతి... నా తఢాకా చూపిస్తాను... శూన్యంలో తిరుగాడుతున్న కేశవరావ్ ప్రేతాత్మ ఘోషించింది. గుండె బాదుకుంది.

కేశవరావు చనిపోయాక అతగాడి ఆత్మకు మరో జన్మ ఎత్తగల ఛాన్సరాక లేక... ఇంకా ఆకాశంలోన తిరుగాడుతూనే వుంది.

రెండేళ్ళ సంసారంలో ఏనాడు తాను వనజను సుఖపెట్టి ఎరగడు. సుఖపడనీయలేదు.

ఇద్దరూ ఒకే కాలేజీలో డిగ్రీ పుచ్చుకుని ఒకే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సంపాదించటం కేవలం యాదృచ్ఛికం!

చదువుకునే రోజుల్లో మొలకెత్తిన ప్రేమ బీజం... పెరిగి పెద్దదై... మహావృక్షమై చివరికి పెళ్ళికి దారితీసింది.

కేశవరావ్ వనజ మెళ్ళో మూడు ముళ్ళు వేసిన మరుక్షణం నుండి అతగాడిలో అనూహ్యమైన మార్పు చేసుకోవటం వనజ పసిగట్టకపోలేదు.

మనసారా నమ్మి ప్రేమించిన కేశవరావ్ నైజం... నిజస్వరూపం ఏమిటో అతనికి భార్య అయిన మరుక్షణం నుంచే తెలుసుకోగలిగింది వనజ.

కేశవరావ్ రెండవ స్వరూపం ఏమిటో తెల్సుకునే నాటికి తను మెడ వంచి తాళి కట్టించుకుని అతనికి అర్ధాంగి పొజిషన్లోకొచ్చాక చేయగలిగిందేముంది ఎడ్జస్టైపోవటంతప్ప అనేసి నోరు నొక్కేసుకుంది.

చుట్టూ వున్న సమాజానికి వెరసి తనే పద్ధతి మార్చుకుని భర్త కేశవరావ్‌కి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తూ వచ్చింది.

తన ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరవుతున్నందుకు మానసిక క్షోభ అనుభవించక తప్పటంలేదు.

నెలనెలా ఎవరి జీతం వారికొస్తున్నా... తన మీద తన సంపాదనమీద ఆధిపత్యం చెలాయించాలనే కేశవరావ్ ధోరణి వనజకు సుతరామూ నచ్చలేదు.

డబ్బు విషయమై కేశవరావ్ ప్రతి క్షణం తనలో గొడవపడటం వనజ మనసును కలచి వేయనారంభించింది.

'వనజా! నేన్నీకు భర్తను! నీమీద నాకు సర్వాధికారాలున్నయ్. సంపాదిస్తున్నావ్ కదాని విర్రవీగకు! జాబ్‌లో చేరింది లగాయితూ నేను పదేపదే నీ జీతం నాచేతిలో పోయమని హెచ్చరిస్తున్నా. నువ్ పెడచెవిన పెడుతూ వస్తున్నావ్. అది నాకు బొత్తిగా నచ్చటంలేదు!- సరే... ఆ విషయాన్ని అలా వుంచి... ఇంతవరకు నువ్వు ఎంత 'సేవ్' చేశావో అదైనా చెప్పు?...' భార్యని నిలదీశాడు కేశవరావ్.

'మీరెంత వెనకేశారేమిటి?' ఎదురు ప్రశ్న వేసింది వనజ.

కేశవరావ్‌లో కోపం జొరబడినా... ఆవేశాన్ని ప్రదర్శించకుండా 'లేడీస్ ఫస్ట్ కదా... ఫస్ట్ నువ్వే చెప్పాలి!...' తెలివిగా మాట్లాడాడనే గర్వం వుట్టిపడేలా కనుబొమలెగరేశాడు.

'అటు తిప్పి ఇటు తిప్పి మాట్లాడి... మొత్తానికి మగవారిదే (సారీ!... మొగుడిదే) పైచేయి అన్పించుకుంటారు కదా?!... ఇప్పుడా లెక్కలన్నీ ఎందుకు చెప్పండి? పుట్టని కూతురుకి... మీరివ్వబోయే కట్నం గురించి అంచనాలు వేస్తున్నారా?' భర్త ఆలోచన్లకు చిక్కకుండా ఎస్కేప్ అయ్యేవిధంగా మాట్లాడింది వనజ.

'మీ ఆడాళ్ళతో వచ్చిన చిక్కే ఇది! మీ వయస్సూ చెప్పరు... ఆదాయాన్నీ బైటపెట్టరు!- అయినా మనమధ్య దాపరికాలు... రహస్యాలెందుకు వనజా!?!...'

ఒరే మొగడా! నువ్వెన్ని విధాలుగ మేటర్‌ని ట్విస్ట్ చేసి అష్టవంకర్లతో ఇన్ఫర్మేషన్ నానుండి రాబట్టాలని ప్రయత్నించినా... అది కుదిరే విషయంకాదు... అనుకుంది వనజ మనసులో.

'అయితే నీ సేవింగ్స్ ఎంతో చెప్పనంటావ్? భార్యామణి ఈ విధంగ బిగుసుకోవటం ధర్మంకాదు వనజా?'- కాళ్ళబేరానికొచ్చాడు.

'ఇప్పుడసలు నా డబ్బుతో పనేమొచ్చింది?- ఇంటి ఖర్చులకు పోనూ ఇద్దరం నెలనెలా ఎంతో కొంత సేవ్ చేస్తూనే వున్నాం కదా?-'

'అద్సరేనోయ్! ఆర్.డీ.లు ఎన్ని కడుతున్నావ్! ఎఫ్.డి.లో ఎంతుందో... ఆ వివరాలన్నా తెల్సుకోవాలి కదా?-'

ఇన్ని వివరాలు అడుగుతున్నాడంటే... ఏదో పెద్ద ప్లాన్లోనే వున్నాడన్పించింది వనజకు.

'చూడూ! అర్జంట్‌గ నాకో రెండు లక్షలు కావాలి...' సూటిగ అడిగేడు.

'అంత డబ్బే!... ఎందుకు?-' నివ్వెరపోయింది.

'వివరాలు చెప్తేగానీ తమరు ఈయరా? నీ డబ్బు కదా... పోనీ అప్పుగానే ఇవ్వులే!

ఇన్‌స్టాల్‌మెంట్ బేసిస్ మీద తీర్చేస్తానే...'

'అసలు అంత ఎమౌంట్ దేనికో చెప్పండి'.

'షటప్! భర్తనే గౌరవం లేకుండాపోయింది. సంపాదిస్తున్నావనే పొగరా?...' చెంప ఛెళ్ళుమన్పించాడు.

'యూ రాస్కెల్! నన్ను కొడతావా? నీ గొప్పేంటి? నన్ను కొట్టే అధికారం నీకెక్కడిది? ప్రేమించి పెళ్ళి చేసుకున్నవాళ్ళం... కట్టుకున్న భార్యననే గౌరవమైనా లేకుండా ఇంతకు తెగిస్తావా?- నో!... నాతో మాట్లాడకు- నీ ముఖం చూడాలంటేనే అసహ్యంగా వుంది. కల్చర్ లెస్ బ్రూట్...' ఆవేశపడుతూ పళ్ళునూరి కనుగుడ్లు పెద్దవి చేసింది.

'చాలా ఎక్కువ మాట్లాడావ్! ఇక నోరు మూసుకో! నీకిదే చివరిసారిగ చెప్తున్నాను. వచ్చే ఫస్ట్ తారీకునుండి నీ జీతం మొత్తం నా దోసిట్లో పెట్టాలి! అట్లా చేయకపోయావో... నీ అంతు చూస్తాను...' రెచ్చిపోయి మాట్లాడి రివ్వన వీధిలోకి నడిచాడు కేశవరావ్.

ఇలాంటి మూర్ఖుడినా తాను ప్రేమించి పెళ్ళాడింది? ఇంతటి కుసంస్కారినా అభిమానించి మనసులో ప్రేమ పెంచుకుంది?... ఇంతటి రాక్షసుడా తన భర్త?... ఈ విధంగ తన్ను 'టార్చర్' చేయటం సహించలేదన్పించింది. పొంగివచ్చే దుఃఖాన్ని దిగమింగుకో ప్రయత్నించింది. పైటకొంగుతో కళ్ళొత్తుకుంది. రివ్వున వెళ్ళి బెడ్‌మీద వాలిపోయింది వనజ.

ఇంట్లో పొయ్యి రాజేయులేదు. ఎవరికి వారు బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌నుండి తెచ్చుకుంటున్నారు. లంచ్ కేంటీన్లో తింటున్నారు. డిన్నర్ విషయానికొస్తే వీలునుబట్టి ఎవరిదోవ వారిదైంది. ఇద్దరిమధ్య మాటల్లేవ్!

పదిరోజుల్లో ఫస్ట్ తారీకు గిర్రున తిరిగి రానే వచ్చింది.

తాను ఫస్టునాడే జీతం తీసుకోవటమా? లేక తర్వాత వీలున్నప్పుడు 'పే' ఆఫీసుకెళ్ళి విడిగా శాలరీ తెచ్చుకోవటమానే డోలాయమాన స్థితిలో వనజ మనసు వూగిసలాడుతోంది.

మొదటి తారీకునే ఎప్పటిలాగే జీతం తీసుకుంటే... జీతం మొత్తం తనకిమ్మంటూ కేశవరావ్ దౌర్జన్యానికి దిగచ్చు! అదీ... ఆఫీసులో!... కొలీగ్స్ మధ్య వాదులాట ఎంత ఇన్డీసెంట్‌గ... అసహ్యంగ వుంటుంది?... ఇవ్వనంటే... మళ్ళీ పబ్లిగ్గ ఆఫీసులో అందరి ఎదుట కొడతాడేమో? అది తన కెంత నామోషి? అవమానం? తాను భరించలేదు.

రానురాను ఇలా తయారవుతున్నాడేంటి కేశవరావ్?- ఒకరి బాగోగులు ఇంకొకరికి పట్టనంత వైరుధ్యం ఇద్దరిమధ్య నెలకొన్నది. ఒకరి గురించి మరొకరు పరామర్శ చేసుకోవటం అస్సల్లేకుండా పోయింది.

పెళ్ళికిముందు ఎంత సరదాగా వుండేవాడు తనతో?- ఐస్‌క్రీమ్ పార్లర్‌కెళ్ళి

కావలసింది ఆర్డర్‌చేసి తింటూ ఒకరి కళ్ళలోకి మరొకరు ప్రేమానురాగాలు ఒలకబోసుకు చూస్తూ తదాత్మ్యం చెందేవారు.

వారానికి రెండుసార్లయినా హుసేన్‌సాగర్‌లో బోటు షికారు చేసి థ్రిల్ ఫీలయ్యేవారు... సన్డేనాడు ఐమాక్స్ థియేటర్లో సినిమా తప్పనిసరి... ఇంటికొస్తూ హోటల్లో డిన్నర్.

అలాంటి తీపి ఘడియలు... మధుర క్షణాలు ఇప్పుడేమైనయ్? అదంతా నన్ను లోబరుచుకోవటానికి కేశవరావ్ వేసిన ఎత్తుగడా?... ఆడిన నాటకమా?-

ఒక మనిషి రెండు రూపాలుండటమంటే ఇదే కాబోలు అనుకుంది వనజ! ప్రాణాధికంగ అభిమానించి హృదయాధికంగ ప్రేమించిన కేశవరావ్ ఇలా తయారైనాడేమిటి? ఎందుకీ విధంగ మారేడు?

ఛీ! ఇలాంటి నరరూప రాక్షసుడుని భర్తని చెప్పుకోవటానికే సిగ్గుగా వుంది! సంసారం చేయటానికే అసహ్యమేస్తోంది... వనజ మనసు కోపంతో వూగిపోతోంది.

పెళ్ళయిన కొత్తల్లో సైతం... తన పట్ల శాడిస్టిగ ప్రవర్తించటం... నోటికొచ్చినట్టు తిట్టటం... కొరకటం... గిల్లటం... గిచ్చటం... ఇష్టంలేకపోయినా పశువులా ప్రవర్తించటం తనకు బొత్తిగ నచ్చలేదు. అయినా భరిస్తూ వచ్చింది.

చివరికి తనపై ఆధిపత్యం చెలాయించాలనే మృగవాంఛతో చెయ్యి చేసుకోవటంతో కేశవరావంటే అసహ్యమేస్తోంది. మనిషా అతను? నో! పశువు!... కాదు... రాక్షసుడు!

ఇలాంటి భర్త ఎంత నీచానికైనా వొడిగడతాడన్పించటంతో జీతం తీసుకున్న మరుక్షణమే ఎర్లీ పర్మిషన్ పెట్టి... కేశవరావ్ కళ్ళబడకుండా ఇంటికొచ్చేసింది వనజ.

రాత్రి తొమ్మిదిగంటల సమయంలో... తను బెడ్‌రూమ్‌లో వెల్లకిల పడుకుని మేగజైన్ తిరగేస్తున్న సమయంలో కేశవరావ్ ఎంట్రీ ఇచ్చాడు.

నేరుగ తనవైపే రావటం గమనించిన వనజ పడుకున్నదల్లా లేచికూర్చుంది.

'ఏమే... నాచేతికి చిక్కకుండా... ఎస్కేపై ఎర్లీగా దొడ్డి దోవన ఇంటికొస్తావా?... ఏదీ నీ జీతం?- ఆఫీసులోనే నాకు హేండోవర్ చేయమని చెప్పానా లేదా? మరి నన్ను లక్ష్యపెట్టకుండా... నీ జీతం నాకివ్వకుండానే తప్పించుకొచ్చావా ఇంటికి... ఇప్పుడెక్కడికి పోతావే?- నీ అంతు చూస్తాను...' ఆవేశపడుతూ నోటికొచ్చినట్టల్లా వాగుతున్నాడు.

భర్త తాగివచ్చాడనే విషయం వనజకి అర్థమైంది.

'వెళ్లండి! వెళ్ళి మీ బెడ్‌రూమ్‌లోకెళ్ళి పడుకోండి! నన్ను డిస్టర్బ్ చేయద్దు...' తల పక్కకు తిప్పేసుకుని దూరంగ జరిగింది.

'జీతమేది? ఏంటి లేటు? ఇయ్యవా?-' పాంట్‌కి వున్న బెల్టు తీసి వనజను గొడ్డును బాదినట్టు బాది హింసించాడు.

కసిపోక... ఆమె బీరువా తీసి జీతం వున్న హేండ్‌బ్యాగు తీసుకుని తడబడే అడుగులతో బైటికెళ్ళిపోయాడు.

ఆ రాత్రంతా వనజకు కంటిమీద కునుకు కరువైంది. ధారాపాతంగ కళ్ళు వర్షిస్తూనే వున్నయ్. బెల్ట్ దెబ్బలు తగిలిన చోటల్లా బాధ వుపశమనానికి అయింట్‌మెంట్ రాసుకుంది. ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందాని నిరీక్షించసాగింది.

★ ★ ★ ★ ★

జీతంతోపాటు తన ఏటిఎం కార్డు పట్టుకెళ్ళాడు కేశవరావ్. ఇలాంటి మనిషితో ఎలా కాపురం చేయటమన్పించింది. నో! ఇలాంటివాడు నాకు అక్కర్లేదు. ఈ రాక్షసుడు తనను మనశ్శాంతితో బతకనీయడు. రాక్షసకృత్యాలను భరించగలిగే శక్తి తనకు లేదు.

కేశవరావ్‌నుండి... అతడి కబంధ హస్తాలకు అందనంత దూరం పారిపోవటం మంచిదన్పించింది.

మళ్ళీ అంతలోనే తానెందుకు పారిపోవటం? అని మనసు మార్చుకుంది.

తనకు దూరపు బంధువు సిటీలో ఎ.సి.పి. వుంటున్న విషయం గుర్తుకొచ్చి... ఇంటికి తాళంపెట్టి... ఆటోలో రాజేష్ ఆఫీసు వెతుక్కుంటూ వెళ్ళింది వనజ.

వనజను రాజేష్ గుర్తించాడు. సాదరంగ లోనికి ఆహ్వానించాడు.

'సారీ వనజా! మీ పెళ్ళికి రాలేకపోయాను' అన్నాడు ఎ.సి.పి. రాజేష్.

'ఎందుకని అలా నీరసంగా కన్పిస్తున్నావ్? వాట్ ఈజ్ ది రీజన్?... ఎనీ హెల్ప్ యూ నీడ్?-' ఆత్మీయంగ ప్రశ్నించాడు.

పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకో ప్రయత్నిస్తూ జరిగినదంతా రాజేష్‌కు పూసగుచ్చినట్టు వివరించింది.

'సరే... యూ డోన్ట్ వర్రీ! ఐ విల్ లుక్ ఇంటూ దిస్ మేటర్- నీకేం భయంలేదు. ధైర్యాన్ని నూరిపోశాడు.

ఆరోజే ఎస్సైకి ఫోన్‌చేసి కేశవరావ్ డిపార్ట్‌మెంట్ వివరాలు చెప్పి అతడిని తనవద్దకు సగౌరవంగ వెంటపెట్టుకు రమ్మని చెప్పాడు.

'నువ్ ఇంటికెళ్ళు వనజ! ఈ ఇష్యూ నాకు వదిలెయ్...' అని రాజేష్ అనటంతో ఇంటిదారి పట్టింది వనజ.

మరోగంటలో కేశవరావ్‌ని వెంటబెట్టుకొచ్చాడు ఎస్సై.

'సో... యువార్ కేశవరావ్! నీ చరిత్రంతా నాకు తెల్సు! గృహహింసకు పాల్పడుతున్నావని నాకు కంప్లైంట్ వచ్చింది. ఎంక్వైరీ జరిపి నీమీద చర్య తీసుకోవటానికే

పిలిపించాను...' నఖశిఖపర్యంతం కేశవరావ్‌ని చూస్తూ అన్నాడు ఎ.సి.పి. రాజేష్.

పరిస్థితి అర్థంకావటంతో కేశవరావ్ నోరు మెదపలేకపోయాడు.

'ఇతడిని తీసుకెళ్ళి స్టేషన్లో సెల్లో పడేసి వుతకండి. అప్పుడు గాని బుద్ధిరాదు...' ఎస్సైకి పురమాయించటంతో కేశవరావ్‌ని తనవెంట తీసుకెళ్ళాడు.

ఇరవై నాలుగు గంటల్లో కేశవరావ్ వళ్ళు హూనమైంది. లేచి నిలబడి నడవగలిగేస్థితిలో లేడు. తర్వాత బైటికి పంపారు.

జరిగిన అవమానం కేశవరావ్‌ని దహించివేస్తోంది. ఇలా జరుగుతుందని తాను కల్లోనైనా ఊహించలేదు.

ఇదంతా వనజ ప్లాన్ అన్నమాట! ఈ జన్మలో దాని మొహం మళ్ళీ చూడకూడదనుకున్నాడు. ఆమెపట్ల కోపం... ఆవేశం... అసహ్యం... జుగుప్స కలిగేయి. తనకు జరిగిన ఘోర అవమానాన్ని సహించలేక పోయాడు.

ఇది జరిగిన మూడవరోజు కేశవరావ్ హుస్సేన్‌సాగర్‌లో శవమై తేలాడు.

భర్త కన్పించనందుకు వనజ పోలీస్ రిపోర్ట్ ఇవ్వలేదు. ఆత్మహత్య చేసుకున్న విషయం తెల్సుకుని కంటతడి అయినా పెట్టలేదు.

కేసు... పోస్ట్‌మార్టం అనే వాటికి తావివ్వకుండా ఏ.సి.పి. రాజేష్ తనవంతు సహాయం చేశాడు.

కేశవరావ్ అనాథ శవానికి చివరికి మున్సిపల్ కార్పోరేషన్ వారే అంత్యక్రియలు జరిపించారు. అతని డెడ్‌బాడీని ఎవరూ హేండోవర్ చేసుకోవటానికి ముందుకు రాకపోవటాన!

★★★★★

రాజేష్ ఏ.సి.పి. ప్రోద్భలంవల్ల వనజ మళ్ళీ వివాహం చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

మేరీడ్ లైఫ్ హేపీగ గడపగలుగుతోంది. ఈ సుఖాన్నే... మనశ్శాంతినే తాను కోరుకున్నది!

కేశవరావ్ ప్రేతాత్మ మాత్రం వనజ చుట్టూ ఇంకా పరిభ్రమిస్తూనే వుంది! ఆమెపై సంపూర్ణంగ కచ్చ తీర్చుకోలేకపోయినందుకు ప్రేతాత్మ ఘోషిస్తూనే వుంది.

చచ్చి సాధించటం అంటే ఇదే కాబోలు?!

- సమాప్తం -